

# నా కళ్ళతో నాన్న

**– లిపి మల్లాది**



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మెమరీస్‌కి** గల విలువ కాలం చెయ్యి జారాకే మనకి తెలుస్తుంది. అటువంటివి ఎదుర్కొన్న అనుభవంతోనో, లేక మేము పుట్టకముందు వారి యవ్వనంలో జరిగిన విషయాలు మాతో పంచుకోవాలనో, మా అమ్మ, నాన్న వారి జ్ఞాపకాలు ఎన్నో మా కోసం పోగుచేసారు.

వాటిలో నాకు బాగుర్తున్నవి ఫోటోలు, పోస్ట్‌కార్డులు. కావ్య చాలా చిన్నపిల్లగా ఉన్నప్పుడు మా నాన్న వేరే దేశానికి వెళ్ళారు. అక్కడనుండి ఎప్పటిలాగే మా నాయనమ్మకి ఓ పోస్ట్‌కార్డ్, మా అమ్మకి ఓ పోస్ట్‌కార్డ్‌తో పాటు కావ్యకి కూడా ఓ పోస్ట్ కార్డ్‌ని పంపారు. కావ్యకి వచ్చిన మొదటి ఉత్తరం మా నాన్ననుండి కావడం నాకు కాస్త ఈర్ష్యని కలిగిస్తుంది. చిన్నప్పుడు వాటి విలువ అర్థంకాకపోయినా ఇప్పుడు వాటిని చూస్తే కాస్త ఆనందం, కాస్త బాధ కలుగుతుంది. మా అమ్మ డిస్నీలాండ్‌లో ప్లూటో పక్కన, మా నాన్న యూనివర్సల్ స్టూడియోస్‌లో గొరిల్లా పక్కన తీసుకున్న ఫోటోలు నాకు బాగా గుర్తు.

"అమ్మా, ప్లూటోతో నువ్వు ఆడుకున్నావా?" అని ఐదారేళ్ళ వయసున్నప్పుడు నేను అడిగాను.

"నాన్నా, గొరిల్లాని చూస్తే నీకు భయమెయ్యలేదా?" అని అడిగినప్పుడు

"లేదు గొరిల్లానే నన్ను చూసి భయపడింది" అని మా నాన్న నవ్వించడం కూడా నాకు ఇంకా జ్ఞాపకం.

చిన్నప్పుడు ఫోటోల్లో చూసినవి మా అమ్మా నాన్నతో కలిసి చూడాలని నాకు ఎంతో కోరిక. అందుకు కారణం ఫోటోలు చూపిస్తూ మా అమ్మ చెప్పిన కథలో, లేక వారితో నాకున్న బంధమో నాకు తెలీదు. ఎన్నేళ్ళొచ్చినా మనలో ఉన్న బాల్యం కొంత మిగిలే ఉంటుందని అంటారు. మా అమ్మకి యూనివర్సల్ స్టూడియోస్‌లోని రైడ్స్ అంటే ఇంకా ఇష్టం.

అదృష్టవసాత్తూ రెండు సంవత్సరాల క్రితం అమ్మా నాన్నతో కలిసి యూనివర్సల్ స్టూడియోస్‌కి వెళ్ళగలిగాను.

"మనం వచ్చినప్పుడు చూసాం అది గుర్తుందా? ఆ రోజు ఇది ఎక్కాం" అంటూ మా అమ్మా, నాన్నా మాట్లాడుకోవడం నన్ను చిన్నప్పుడు వారు కథలు చెప్పిన రోజులకి తీసుకెళ్ళింది. దెయ్యాల సినిమాలు, భూతల కథలు ఇష్టపడే మా అమ్మ, నేను "హాలోవిన్

రోజున హారర్ నైట్స్‌కి వెళ్దాము" అనగానే మా నాన్న ఎప్పటిలానే వెంటనే ఒప్పుకున్నారు. సరదాగా ఆ రాత్రంతా గడిపి హోటల్ చేరేసరికి ఉదయం నాలుగు దాటడం మా ముగ్గురినీ ఆశ్చర్యపరిచింది. ఆ రోజు తరువాత ఎంత మంది బతిమిలాడినా నేను యూనివర్సల్ స్టూడియోస్‌లో అడుగుపెట్టలేకపోయాను.

తరచూ కొత్తప్రదేశాలు సందర్శించే మా నాన్నే నాకు బెస్ట్ గైడ్. ఓ ప్రదేశానికి గల చరిత్రని బోర్ కొట్టకుండా, ఆసక్తికరంగా మా నాన్న ఎలా చెప్పగలరో, మా అమ్మకూడా అదేవిధంగా చెప్పగలదు. నాకు గుర్తున్నంత వరకు మా అమ్మా, నాన్న ఏదైనా చోటుకి గల హిస్టరీ గురించి ఏకీభవించాల్సిన సందర్భాల్లో చాలా వరకు మా అమ్మే గెలుస్తుంది. తిరువణ్ణామలైనుండి అమెరికాకు వరకు అమ్మా, నాన్నలతో తిరిగిన నేను ఎక్కడికి వెళ్ళినా 'వారికి నచ్చుతుందా?' అనే భావంతో చూడ్డం అంతర్లీనంగా అలవాటైందని ఇటీవలె తెలుసుకున్నాను. అలా, నేను కేటలీనా ఐలెండ్‌కి మా అమ్మా నాన్నని తీసుకెళ్ళాలని ఎన్నో ఏళ్ళుగా అనుకున్నాను.

కిరణ్‌ప్రభ, కాంతికిరణ్‌గారిని కలవడానికి డబ్లిన్ వెళ్దామనుకున్నప్పుడు "ఓ రెండురోజులు నాకు కేటాయిస్తారా? మనం కేటలీనాకి వెళ్దాం" అని అడిగాను. అలా కిరణ్‌ప్రభగారి పుణ్యమాని ఆ కోరిక నాకు తీరింది. ఎప్పుడూ నాకు గైడ్‌గా కొత్త ప్రదేశాలు, వాటి కథలు చెప్పే అమ్మ, నాన్నకి నేను మొదటిసారిగా గైడ్‌గా ఉండడం నాకు ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. మా అమ్మ మొదటిసారి సబ్ మెరీన్ ఎక్కడం, మా నాన్న మొదటిసారి అమెరికాలో ఐలెండ్‌కి రావడం నాతోనే కావడం నాకు ఎంతో తృప్తి కలిగించిన విషయం. మా ముగ్గురి అభిరుచులు కలవడంతో హైకింగ్‌కి వెళ్ళడం, పడవ ప్రయాణం, సీనిక్ డ్రైవ్, మొదలగున్నవి చాలా ఆహ్లాదంగా గడిచాయి. నేను ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం నేను, మా నాన్న బీచ్‌లో కూర్చుని జీవితం గురించి, నా ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చర్చించుకోవడం. పాతికేళ్ళు దాటినా చిన్నపిల్లలా ఐస్క్రీం తింటూ ఎగరడం అమ్మా, నాన్నతో ఉన్నప్పుడు చూసేవారికి కూడా వికారంగా ఉండదని అప్పుడే అర్థమైంది.

తల్లిదండ్రులకి కొత్తప్రదేశాలు చూపించే అదృష్టం ఎంతమందికి ఉందో నాకు తెలియదు కానీ అందులో లభించే సంతృప్తి మరే పనిలోనూ దొరకదు. ప్రతి సంవత్సరం కేటలీనాకి క్రమం తప్పకుండా వెళ్ళే నేను, ఆ తరువాత అక్కడ అడుగుపెట్టలేకపోయాను. మా అమ్మలాగే నా పిల్లలకి ఆ ఫోటోలు చూపించి కథలుగా చెప్తాను కాబోలు. బహుశా, నాలాగే నా పిల్లలు కూడా నాతో ఆ ప్రదేశాన్ని చూడాలనుకుంటేనే తిరిగి నా కళ్ళు కేటలీనాని చూస్తాయేమో.

ఒక శాస్త్రవేత్త ఎలాంటి సంగీతం వింటారు? ఒలంపిక్ గోల్డ్ మెడలిస్ట్ ఎలాంటి సినిమాలు చూస్తారు? వంటి ప్రశ్నలు కలిగే నాకు సమాధానం దొరికిన ఏకైక ప్రశ్న 'ఒక రచయిత ఎలాంటి పుస్తకాలు చదువుతారు?' మా నాన్నకి కొమ్మూరి సాంబశివరావు, మహామాయ రాసిన కనకమేడల ఇష్టమని ఇదివరకే రాసాను. వారు కాకుండా మా నాన్నకి నచ్చిన రచయితలు యద్దనపూడి సులోచనారాణి, నెవిల్ షూట్, ఎర్మ బాంబెక్, ఆర్ట్ బక్‌వాల్డ్, హెన్రీ సెల్సార్, మొపాసా, సోమర్ సెట్ మామ్ మొదలగువారు.

ట్రాజడీని ఎక్కువ రాయని మా నాన్న, ఏడుపుగొట్టు సినిమాలు పెద్దగా ఇష్టపడరు. నిజానికి దగ్గరగా ఉన్న, హృదయవిదారకమైనా ఏడుపుగొట్టు కాని రోమన్ హాలిడే మా ఇద్దరికీ ఇష్టం. అలాగే, ప్రాక్టికల్‌గా, కామెడీగా ఉండే మై కజిన్ విన్నీ కూడా మాకు ఇష్టం. ఇవిగాక మా నాన్నకి దేవదాస్, పక్కింటి అమ్మాయి, గోపాలరావుగారి అమ్మాయి, అగ్గిరాముడు (బ్లాక్ అండ్ వైట్), పెళ్ళికాని పిల్లలు, ది గుడ్ ది బాడ్ అండ్ ది అగ్లీ, ఉమెన్ ఆఫ్ స్ట్రా, ది మెగ్నిఫిషెంట్ సెవెన్, ది ట్రైన్ మొదలగున్నవి. నాన్నకి నచ్చిన సినిమాలు చిన్నప్పటినుండి చూస్తూ పెరిగిన నాకు మా అమ్మ ఫేవరెట్ సినిమా తెలిసింది ఒక సంవత్సరం క్రితం. "ఇవాళ అమ్మ ఫేవరెట్ సినిమా చూసాము" అని హ్యూస్టన్‌కి వెళ్ళినప్పుడు మాట్లాడుతూ అక్కకి చెప్పాను.

"అవునా? ఏ సినిమా?" అని అడిగినప్పుడు "శ్రీ రాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్" అనగానే తను ఆశ్చర్యపోయింది.

"అవునులే. నాన్న ఇష్టాయిష్టాలు తెలుస్తాయి. నావి ఎందుకు తెలుస్తాయి?" అని మా అమ్మ వాపోయింది.

నాన్నకు నాకూ ఒకేలాంటి సంగీతం, ఒకేలాంటి పుస్తకాలు, ఒకేలాంటి సినిమాలు నచ్చడం నాకు కాస్త గర్వంగా అనిపిస్తుంది. "నాన్నకి, నాకూ నచ్చుతుంది. నీకు బోర్ కొడితే వేరే గదిలోకి వెళ్ళు" అని ఎన్నోసార్లు చాలామందిని దబాయించాను.

"అచ్చు నాన్నలానే మాట్లాడతున్నావు. అన్నీ నాన్న పోలికలే" అని మా అమ్మకి రోజుకి కనీసం రెండుసార్లైనా అంటుంది. (కొన్నిసార్లు కోపంగా, కొన్నిసార్లు మురిపెంగా.)

ఆయన నుండి నేను నేర్చుకున్న ముఖ్యమైన విషయం "నిజాయితీగా ఉండాలి. ఎవరికీ భయపడకు, ఎప్పుడూ అబద్ధం చెప్పకు, నిజాయితీగా ఉండు" అని మా నాన్న నాకు నేర్పిన సూక్తులు. అందరిలా కాక మా నాన్న పాఠించిన సూక్తులే నాకు నేర్పారు. చిన్నతనం నుండీ నేను చూసినవే నేర్చుకున్నాను. అందరి పిల్లల్లాగే చెప్పిన మంచిని కొన్నిసార్లు పెడచెవిన పెట్టినా, మా అమ్మా, నాన్న జీవితాన్ని చూసే నేను ఎంతో నేర్చుకున్నాను.

ఓసారి మా నాన్న స్నేహితుడైన ఒక సీనియర్ ఎడిటర్, కమిటీ మెంబర్ జూబ్లీ హిల్స్‌లో జర్నలిస్ట్ కాలనీలో ఒక ప్లాట్ అలాట్ చేయిస్తామని చెప్పారట. ముందు ఒప్పుకున్నా, మరో సొంత ఇల్లు ఉండకూడదని తెలుసుకున్న మా నాన్న "నాకు ఆల్రెడీ ఇల్లు ఉంది కదా" అని అన్నారట.

"జర్నలిస్ట్ కాలనీలో ఇల్లు తీసుకున్న దాదాపు అందరికీ ఇళ్ళున్నాయి. మీ ఆవిడ పేరు మీద ఈ ఇల్లు చూపించి ఆ ప్లాట్ తీసుకోండి" అని ఆయన సలహా ఇచ్చారట.

"వద్దండి. అది ఇల్లు లేనివారికే ఇవ్వండి. నాకు అలా మోసం చెయ్యడం ఇష్టంలేదు. పైగా ఇల్లు అవసరమైన జర్నలిస్టులు ఎందరో ఉన్నారు" అని మా నాన్న అనడంతో "పిచ్చి వాడిలా మాట్లాడ్తారేంటి ఉచితంగా ఇల్లు ఇస్తానంటే" అని ఆయన పోట్లాడినా, తన ప్రిన్సిపల్స్‌కి కట్టుబడి, ఎవరినీ మోసగించడం ఇష్టంలేక ఇప్పుడు కోట్ల విలువ చేసే స్థలాన్ని వదులుకున్నందుకు మా నాన్న ఒక్క క్షణం కూడా విచారించలేదు.

"మీ నాన్నకి నువ్వైనా చెప్పచ్చుకదా" అని తన స్నేహితులు లేదా చుట్టాలు ఎప్పుడైనా అన్నా కేవలం నవ్వడం నా అలవాటు. చీమకి కూడా హాని తలపెట్టకుండా, తలుపు తట్టి బంగారం వచ్చినా పరాయి సొమ్మైతే తాకకుండా, కేవలం తన కష్టానికి వచ్చే ఫలితాన్ని మాత్రమే ఆశించే తండ్రిని పొందడం మాకు ఎంతో గర్వం. ఎన్ని విధాలుగా వెతికినా ఒక్క వేలుకూడా తనవైపు చూపడానికి ఎవరూ సాహసించరు. ఎందుకంటే కారణాలు దొరకవు. అటువంటి పెంపకంలో పెరిగిన నేను రూల్స్ పాటించడం నా ఫ్రెండ్స్‌కి నవ్వు తెప్పించినా, అదే నేను నవ్వులపాలు కాకుండా రక్షిస్తుందని చిన్నతనంలోనే తెలుసుకోవడం అదృష్టం.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story